ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి

జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
బుధవారం 5 నవంబరు 2025

**అరకొర వసతులతో ఇక్కట్లు**
కోరుట్ల ఆసుపత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా ఫలితం శూన్యం
వేధిస్తున్న వైద్యుల కొరత
అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేక గర్భిణుల అవస్థలు 4లో..

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కానుకు పేరిట కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేస్తున్న సైకిళ్లను మంగళవారం మండలంలోని రామన్నపేట, పోతారం గ్రామాల్లో అధికారులతో కలిసి బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. రామన్నపేటలో 35, పోతారంలో 18మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమాల్లో మండల విద్యాధికారి జయ సింహరావు, నాయకులు మల్లేశం, గంగాధర్, ప్రసాద్, నడిపి మల్లేశం, రమేశ్, పరమేశ్, తిరుపతి, మౌర్య రాజు, నాగ రాజు, తిరుపతి, మల్లేశం పాల్గొన్నారు.

## వీహెచ్‌పీ కమిటీ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):విశ్వహిందూపరిషత్ జిల్లా సమావేశం మంగళవారం నిర్వహించారు. పట్టణ కార్యదర్శిగా వడ్లగట్ల భూమేష్, పట్టణ మాతృశక్తి ప్రముఖ్‌గా విశాల లక్ష్మీ, పట్టణ దుర్గ వాహిని ప్రముఖ్‌గా సాతారం పద్మలను నియమించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పి విభాగ్ కార్యదర్శి అయోధ్య రవి, జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న, పట్టణ అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

# యాసంగి సాగుకు కార్యాచరణ



- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్న వ్యవసాయ శాఖ
- జిల్లాలో 3.95 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- యూరియా డిమాండ్ 49,948 మెట్రిక్ టన్నులు

జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి సాగు ప్రణాళికపై వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు, కుంటలు, బావులు, బోరు బావులు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి. దీంతో యాసంగి సాగుకు అన్ని రకాల పంటలు వేసుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో వివిధ పంటల సాగు అంచనా, ఎరువులు, విత్తనాల అవసరాలు ఎంత అనే కార్యాచరణను రూపొందించారు. వ్యవసాయ శాఖ తాజాగా యాసంగి సాగు ప్రణాళికను తయారు చేసి ప్రభుత్వానికి అందించింది.



### 3.02 లక్షల ఎకరాల వరి సాగు అంచనా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 3,95,555 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేయనున్నారు. జిల్లాలో వరి పంట 3,02,600 ఎకరాలు, మొక్కజొన్న 35,000 ఎకరాలు, నువ్వులు 11,000 ఎకరాలు, మామిడి 38,300 ఎకరాలు, పల్లి 320 ఎకరాలు, జొన్నలు 2,300 ఎకరాలు, మిరప 750 ఎకరాలు, చెరుకు 190 ఎకరాలు, ఆయిల్‌పామ్ 4,200 ఎకరాలు, పెసర, మినుము, ఆలసంద, ఆవాలు, కం దులు తదితర పంటలు 895 ఎకరాల్లో సాగు అవు తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తు న్నారు. ఇందులో పది నుంచి ఇరవై శాతం హెచ్చు తగ్గులు ఉండవచ్చని తెలిపారు.

### సమృద్ధిగా నీటి నిల్వలు

జిల్లాలో అత్యధిక మంది రైతులు ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, వరద కాలువ, చెరువులు, కుంటలు, బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. ప్రతీ సంవత్సరంలో యాసంగిలో వరి, మొక్క జొన్న, జొన్న, ఆవాలు, సజ్జ, నువ్వులు, ఆయిల్‌పామ్ పంటలు పండిస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లా అంతటా సాగు నీరు అందుబాటులో ఉండడంతో వరి సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. తక్కువ నీటి అవసరముండే ఆరు తడి పంటలు వేసుకోవడం మిగతా 6లో..

### వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
**భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జగిత్యాల**



జిల్లాలో రానున్న యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు కసరత్తులు చేస్తున్నాం. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు సందర్భంగా అప్రమత్తంగా వ్యవహరించాలి. అవసరమైన సందర్భాల్లో ఆయా మండలాల వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించాలి.

## మార్కెట్‌లో కార్తీక సందడి



జగిత్యాలలో టవర్ సర్కిల్ వద్ద జనంతో కిక్కిరిసిన రోడ్డు

జగిత్యాల అర్బన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని పూజా సామాగ్రి కొనుగోలు కోసం వచ్చిన భక్తులతో జిల్లాకేంద్రంలోని మార్కెట్‌లో సందడి నెలకొంది. పట్టణంలోని ప్రధాన మార్కెట్ ఉన్న టవర్ సర్కిల్ ప్రాంతమంతా రద్దీగా మారింది. టవర్ నుంచి మార్కెట్, కస్తూరి స్ట్రీట్ మొత్తం వేలాదిగా తరలి వచ్చిన కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. మామిడి ఆకులు, ఉసిరికాయలు, బంతి, చామంతి పూలు, మట్టి దీపాలు, జామ పండ్ల ధరలు పెరిగాయని భక్తులు పేర్కొన్నారు.

## శాస్త్రీయ ఆలోచనలతోనే అభివృద్ధి
**జిల్లా విద్యాధికారి రాము**



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రాము

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ ఆలోచనలతోనే విద్యార్థుల అభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. డీఈవో కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకిముకి సైన్స్ టాలెంట్ టెస్టుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు కల్పించేది సైన్స్ ఒక్కటేనని అన్నారు. ఈ పరీక్షను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలో నవంబరు 7న, మండల స్థాయిలో 21న, జిల్లా స్థాయిలో 28న జరుగతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు తులసీ ఆగమయ్య, బడే శ్రీనివాస్, దాస రాములు, రాంరెడ్డి, పులి రమేష్, గంగరాజు, బర్ల వంశీ, జానకీరామ్ తదితరులున్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మల్లాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

మల్లాపూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలని మంగళవారం రైతులు రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అక్కడికి చేరుకొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కేంద్రం వద్ద ఎలాంటి సౌకర్యాలు లేవని, తేమను సైతం సరిగా పరిశీలించడం లేదని పలువురు మొక్కజొన్న రైతులు కృష్ణరావుతో మొర పెట్టుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. సంబంధిత అధికారులతో కృష్ణారావు మాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ‘వీఆర్‌ఏ వ్యవస్థను పునరుద్ధరించాలి’

జగిత్యాల అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని జిల్లాలోని వీఆర్‌ఏలు మంగళవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా బవన్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం చేయడానికి రెవెన్యూ రికార్డ్స్ అమలుకు సంబందించి గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పరంగా పర్యవేక్షణ చేపట్టడానికి రెవెన్యూ అధికార యంత్రాంగం బలోపేతం అవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం అంటే రెవెన్యూ అధికార యంత్రాంగం ప్రకృతి వైపరిత్యాలు, అకాల వర్షాలతో పంటలు నేల వాలినపుడు, తుఫాన్ ప్రభావిత సందర్భాలలో ప్రజలను ఆదుకోవడానికి అండగా ఉండాల్సింది రెవెన్యూ యంత్రాంగం అని అన్నారు. ఇప్పుడు విఆర్‌ఏ పోస్టు రద్దు కావడంతో గ్రామ స్థాయిలో ప్రబుత్వ పరంగా బాధ్యత అనేది ఎవరికి లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 వందల మంది విఆర్‌ఏలు 61 సంవత్సరం పైబడి ఉన్నారని వారి స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వానికి నివేదిస్తానని అన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్, జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్, మోరపల్లి గ్రామంలో సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను రైతులు ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం సురేందర్, తిప్పన్నపేట పంచాయితీ కార్యదర్శి కొమురయ్య, కారోబార్ శేర్ల రమేష్, రైతులు చిత్తారి ప్రభాకర్, బోగుసతీష్, భారతపు నారాయణ, భారతపు పెద్దిరాజం, భారతపురెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, సీతఊట వేణు పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్థాలను మున్సిపల్ వాహనాలకు అందించాలి
**-బల్దియా కమిషనర్ మోహన్**

మెట్‌పల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చికెన్ సెంటర్ యజమానులు వారి సెంటర్లలో సేకరించిన వ్యర్థాలను మున్సిపల్ వాహనా లకు అందించి పరిశుభ్రతను కాపాడాలని బల్దియా కమిషనర్ మోహన్ సూచించారు. మంగళవారం పట్టణ చికెన్ సెంటర్ల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందించారు. బహిరంగ ప్రదేశా లలో చికెన్ వ్యర్థాలు పడవేస్తే యజమానులపై జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్షయ్ కుమార్, ముజీబ్‌లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
**-సికింద్రాబాద్ డీఆర్‌ఎం గోపాలకృష్ణ**



రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం గోపాలకృష్ణ

జగిత్యాల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణ కాంట్రాక్టర్లను ఆదేశించారు. జగిత్యాలలోని లింగంపేట రైల్వేస్టేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆలస్యం చేయకూడదని హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ డీసీఎం షిపాళి కుమార్, సీనియర్ డీవిఎం సురేష్‌రెడ్డి, డీఎన్ శశాంక , కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

పెగడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాను వల్ల తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లి, పెగడపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో తడిచిన మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిచి రైతులు అరిగోస పడుతుండగా కాంటాలు మొదలయ్యేలా చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అధికారులు తక్షణమే స్పందించి వెంటనే కాంటాలు ప్రారంభించడంతో పాటు తడిచిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, నాయకులు మాజీ వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, మాదారపు కరుణాకర్ రావు, రాజేశ్వర్ రావు, బొమ్మెన స్వామి, సత్యనారాయణ రెడ్డి, విజయ్ యాదవ్, రాజశేఖర్ గౌడ్, వీరేశం, మల్లేశం, రాజమల్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆ దిశగా దృష్టిసారించాలని జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జి. శ్యాంప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలోని ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం శ్యాంప్రసాద్, జగిత్యాల నియోజకవర్గ ఉద్యాన అధికారి స్వాతి, లోహియా ఆయిల్‌ఫామ్ కంపెనీ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయిల్‌ఫామ్ తోటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్ల, పోషకలోపాలను గుర్తించి వాటి యాజమాన్య పద్ధతులను రైతులకు శ్యాంప్రసాద్ వివరించారు. ప్రస్తుతం బోరాన్ లోపం ఉందని ప్రతి చెట్టుకు 100 గ్రాములు బోరాన్ వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారులు అనిల్, అన్వేష్, లోహియా కంపెనీ మేనేజర్ విజయభరత్, క్షేత్రసిబ్బంది రమణ పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** రైతులు ఆయిల్ ఫాం సాగుతో పాటుగా పూల తోటల సాగు చేయాలని జిల్లా హర్టికల్చర్ అధికారి శ్యాంప్రసాద్ రైతులను కోరారు. మంగళవారం మండలంలోని పూడూర్, తిర్మాలాపూర్, మండల కేంద్రంలోని రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు ఆయిల్ ఫాం సాగుపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోరారు.

పూడూర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా హర్టికల్చర్ అధికారి మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగుతో పాటుగా పూల తోటల సాగు చేయాలని కోరారు. పూడూర్ గ్రామంలో బంతి పూల సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయం వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. కౌలు రైతు నందగిరి మహేష్ బంతి పూల సాగు చేసినందుకు ప్రభుత్వం తరుపున వచ్చిన పెట్టుబడి సాయం 4 వేల రూపాయలను భూమి పట్టాదారు వెల్ముల రాంరెడ్డి సమక్షంలో అందించారు. రైతు వేదికలలో నిర్వహించు రైతు నేస్తం కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో పి.జ్యోతి, ఉద్యానవన శాఖ హెచ్ఈవో అనిల్, ఏఈవోలు శ్రీలత, గ్రీష్మ, రాజేష్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కళాశాలల ప్రతినిధులతో కలిసి నినాదాలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. ఆయా కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది నిరసన తెలియజేస్తూ పట్టణంలోని స్థానిక తహశీల్‌చౌరస్తా వద్ద మంగళ వారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పక్షాన సంఘీభావం తెలిపిన వసంత మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అటు విద్యార్థులు, ఇటు యాజమాన్యాలతో పాటు అందులో పనిచేసే అధ్యాపకులు, సిబ్బంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

పెండింగ్ బకాయిల విడుదల కోసం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా కళాశాలలు బంద్‌చేసి, రోడ్డుపైకి రావడం ఇదే ప్రథమం అని ఆమె అన్నారు. పలుమార్లు యాజమాన్యాలు ప్రభుత్వంకు విజ్ఞప్తిచేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ఇస్తామన్న రూ.1200కోట్ల టోకెన్‌ల డబ్బులు విడుదల చేయకపోవడంతో విధిలేని పరిస్థితిలో యాజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకోవాల్సి రావడం బాధాకరం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యాజమాన్యాలు సైతం తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ నిధులు విడుదల చేయమని కోరితే విజిలెన్స్ దాడులు, తనిఖీల పేరుతో భయ భ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం చూడడం సరికాదన్నారు. జిల్లాకు రావల్సిన రూ.70కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి కారణంగా ఇప్పటికే జిల్లాలో 10 కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మూతపడ్డాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బందితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు శీలం ప్రవీణ్, చింతల గంగాధర్, గంగిపెల్లి వేణు, గాజుల శ్రీనివాస్, పెండెం గంగాధర్, పట్నం అనురాధ, నీలి ప్రతాప్, ప్రణయ్ తదితరులున్నారు.

## యావర్ రోడ్డును విస్తరించాలని బీజేపీ ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల టౌన్, నవంబరు 4(ఆంధ్ర జోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డును విస్తరించాలని బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మంగళవారం బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఆర్వో కనకయ్యకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి అనేక ప్రభుత్వ కార్యలయాలు, ప్రైవేట్ వ్యాపారాలు విస్తరించాయని అన్నారు. ప్రతి రోజు పలు అవసరాల రీత్యా వివిధ గ్రామాల నుంచి ప్రజలు పట్టణానికి వస్తున్నారని అన్నారు. యావర్ రోడ్డు విస్తరించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ ఖరారు అయిందని పేర్కొంటున్న పాలకులు అమలులోకి తీసుకురావడం లేదన్నారు. అలాగే యావర్ రోడ్డు, సివిల్ ఆసుపత్రి ఎదుట అక్రమ షెడ్లు, పండ్ల వ్యాపారులు రోడ్డును కబ్జా చేశారని ఆరోపించారు. కొత్త బస్టాండ్ సర్కిల్‌లో రోడ్డుపైనే ఉన్న మంచాల క్రిష్ణ పెట్రోల్ పంపును తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజి కౌన్సిలర్లు సీపెల్లీ రవిందర్, ఎసిఎస్ రాజు, అర్వ లక్ష్మీ, అసెంబ్లీ కన్వీనర్ బాషెట్టి ప్రభాకర్, అంకార్ సుధాకర్, లింగంపేట శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## పశువులకు టీకాలు వేయించాలి

కథలాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట, కథలాపూర్ పశువైద్య కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో వంద శాతం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వంద శాతం పూర్తి చేయాలని జిల్లా పశువైద్యాధికారికి ప్రకాశ్ సూచించారు. మండలంలోని కలికోట, కథలాపూర్ గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు దివ్యశ్రీ, శ్రీనివాస్ ఉన్నారు.

● రాయికల్: పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా వేయించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మంగళవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ నాలుగు నెలలు వయస్సు దాటిన పశువులకు టీకాలు వేయించాలన్నారు. దీనికోసం జగిత్యాల జిల్లాలో 69 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం రావడంతో పాటు నోటిలో గిట్టలలో పుండ్లు ఏర్పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య చికిత్సకులు నరేష్ రెడ్డి, ఎల్ఎస్ఏలు అలిగేటి రవీందర్, మిర్యాల నాగేందర్ రెడ్డి, వాసం శివ కుమార్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కారు బీభత్సం

● తప్పిన ప్రమాదం


శంకరపట్నంలో షాపులోకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు కేశవపట్నం రాగానే రహదారి పక్కకు దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కన ఉన్న షాపుల్లోకి దూసుకెళ్లింది. కారు వేగంగా దూసుకెళ్లడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ వైర్లు తెగి కింద పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అంతటితో ఆగకుండా పక్కన ఉన్న కిరాణం, స్వీట్ హౌస్ షాపులోకి దూసుకెళ్లింది. కారు ఢీ కొట్టడంతో షాపుల ముందు ఉన్న ద్విచక్ర వాహనం ఇతర సామగ్రి ధ్వంసమైంది. రోడ్డుపై ప్రజలు ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. కారు బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు.

### కారును ఢీ కొన్న డీసీఎం వ్యాన్

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో కారును వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొన్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారును మొలంగూర్ ఎక్స్‌రోడ్ అండర్ పాస్ వద్ద డీసీఎం వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగం పాక్షికంగా ధ్వంసమైంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

### ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

వేములవాడ రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మూడపల్లి గ్రామం చెందిన సంటి దేవయ్య అనే వ్యక్తి పనిపై హన్మాజీపేటకు వచ్చి తిరిగి మూడపల్లికి వెళుతుండగా ఎదురుగా మరొక ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దేవయ్యకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి రుద్రంగి ఈఎంటి ప్రశాంత్‌కుమార్, పైలెట్ నరేందర్ తరలించారు.

## అరకొర వసతులతో ఇక్కట్లు

● కోరుట్ల ఆసుపత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా ఫలితం శూన్యం
● వేధిస్తున్న వైద్యుల కొరత
● అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేక గర్భిణుల అవస్థలు


కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

నిరుపయోగంగా మారిన ఆక్సిజన్ ప్లాంట్

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్లలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అరకొర వసతులతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలు అందకపోవడంతో క్షతగాత్రులు జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న క్రమంలో మృతిచెందిన సందర్భాలు ఉన్నాయి.

● రూ.12.50 కోట్లతో ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడ్

కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గత ప్రభుత్వం రూ.12.50 కోట్లు నిధులతో 100 పడుకల ఆసుపత్రిగా మార్చేందుకు భవన నిర్మాణం చేసింది. పట్టణంలో జీ ప్లస్ త్రీ భవన సముదాయాన్ని నిర్మించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి తన్నీర్ హరీష్‌రావు చేతుల మీదుగా అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో 100పడకల ఆసుపత్రిని ప్రారంభింపజేశారు.

● ముఖ్యమైన విభాగాలకు వైద్యులు కరువు

ఏరియా ఆసుపత్రిలో 28 మంది వైద్యులు కావాల్సి ఉండగా 15 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, అదనపు గైనకాలజిస్ట్ అవసరం ఉంది. ఉన్న డాక్టర్లకు సరైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక చికిత్స మాత్రమే నిర్వహిస్తున్నారు. కొత్తగా టీ హబ్ ఏర్పాటు చేసి 130 పరీక్షలు చేస్తున్నా స్టేషనరీ కొరత కారణంగా రోగుల సెల్‌ఫోన్లకు వైద్యసిబ్బంది రిపోర్టులను పంపుతున్నారు.

● ప్రతి రోజు 400కు పైగా ఓపీ

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోజు 400కు పైగా రోగులు వైద్య పరీక్షలకు వస్తున్నారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ లేకపోవడంతో గర్భిణులు ప్రైవేట్‌కు వెళ్లాల్సి వస్తోంది.

● మూలనపడిన వైద్య పరికరాలు

సిబ్బంది కొరతతో ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య పరికరాలు మూలన పడ్డాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అందించే ఆక్సిజన్ పీఎస్‌ఏ ప్లాంట్, ప్రాక్చర్‌లను గుర్తించేందుకు ఉపయోగించే సీ-ఆర్మ్ ఎక్స్‌రే ఆర్థోమిషన్ నిరుపయోగంగా మారాయి. రూ.25 లక్షల విలువైన ఆక్సిజన్ పరికరాలు దవాఖాన ఆవరణలో ఉండడంతో అవి తుప్పపడి పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపి ఏరియా ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పేద ప్రజలకు వైద్య సేవలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదికలు పంపాం**

- సునితారాణి,సూపరింటెండెంట్, కోరుట్ల ఏరియా ఆసుపత్రి



ఏరియా ఆసుపత్రి అవసరాలపై వైద్య శాఖ ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న సిబ్బందితో అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నాం.

**మౌలిక వసతులు కల్పించాలి**

-పెండం గణేష్, బీజేపీ మాజీ కౌన్సిలర్,



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలి. ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకలుగా మార్చినా పూర్తి స్థాయిలో వైద్యులను నియమిస్తేనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

### బహ్రెయిన్‌లో అంత్యక్రియల నిర్వహణకు అంగీకార పత్రం

ఇబ్రహీంపట్నం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లో మృతిచెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ అంత్యక్రియలు అక్కడే నిర్వహించేందుకు మృతుడి భార్య అంగీకారం పత్రాన్ని సీఎం ప్రవాసి ప్రజావాణిలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు మంగళవారం అందించారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం బహ్రెయిన్‌లో మృతిచెందాడు. ఈ మేరకు ఆయన మృతదేహం అక్కడే భద్రపరచగా, ఇక్కడికి తీసుకువచ్చేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించేందుకు అంగీకారం పత్రం మీద నరేష్ భార్య లత సంతకం చేశారు. కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు నండి దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సామాజిక సేవకులు మొరపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్ పాల్గొన్నారు.

### దాడి కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం రామయ్యపల్లె గ్రామంలో పరమాల భీమయ్య అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన కేసులో నిందితుడు పందిరి భీమయ్యను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ గ్రామానికి చెందిన పందిరి భీమయ్య ఈ నెల1న పరమాల భీమయ్యపై గొడ్డలితో దాడిచేసి చంపే ప్రయత్నం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 3న ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పందిరి భీమయ్యను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### శతాధిక వృద్ధురాలు మృతి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లో శతాధిక వృద్ధురాలు చెట్టిపల్లి లక్ష్మమ్మ(102) మంగళవారం మృతిచెందిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. ఇటీవల లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిందని పేర్కొన్నారు.

## ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు 20 మంది ప్రయాణికులకు గాయాలు ● బస్సు వేగమే ప్రమాదానికి కారణం


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు


అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

తిమ్మాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యంలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఆర్టీసీ బస్సులోని 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై మంగళవారం ఉదయం 4.50 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం నేదునూర్ గ్రామానికి చెందిన ఎలుగందుల రవీందర్ ధాన్యం బస్తాల లోడుతో ట్రాక్టర్‌ను రైస్ మిల్లుకు తరలిస్తున్నాడు. రాజీవ్ రహదారిపై రేణికుంట వద్ద జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డు పక్కన పల్టీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ దూకేయడంతో గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉండగా డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ పరిశీలించారు.

## అక్కాచెల్లెళ్లపై దాడి

● నిందితుడి రిమాండ్

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డీజేతో ఇబ్బందులు పడుతుండడంతో సౌండ్ సిస్టం నిలిపివేయాలని అన్నందుకు అక్కాచెల్లెళ్లపై దాడికి పాల్పడిన రాజు అనే యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గత నెల 30న మల్యాలకు చెందిన రుద్రవేణి నర్సయ్య చిన్న కొడుకు సంజీవ్ వివాహం జరిగింది. అనంతరం నర్సయ్య, అతడి తమ్ముడు పోచయ్య ఇళ్ల మధ్య గల సందులో డీజే పెట్టి నృత్యాలు చేశారు. దీంతో పోచయ్య ఇద్దరు కూతుళ్లు, నర్సయ్య మరో కొడుకు రాజును బాక్సులు తీయమని, తమకు అసౌకర్యంగా ఉందని కోరారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ జరగ్గా ఆదివారం రాజు, అతడి కుటుంబ సభ్యులు కలిసి తన చిన్నాన్న పోచయ్య ఇంటికి వెళ్లి అక్కాచెల్లెలపై దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యారు. ఇందులో ఒకరు గర్భిణి కాగా బాధితుల ఫిర్యాదు మేరకు రాజు, అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేధిస్తోందని రాస్తారోకో


మెట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి వేధిస్తోందని మంగళవారం విద్యార్థినులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ మీకు తిండి దండగ.. చదువుకు పనికిరారని అంటూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాటలతో వేధిస్తోందని ఆరోపించారు. వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. రహదారిపై ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీసులు విద్యార్థినులకు నచ్చజెప్పినా వినకపోవడంతో ఆర్‌డీఓ పూర్ణచందర్‌కు సమాచారం అందించారు. ఆర్‌డీఓ సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి సెలవు పెట్టి కళాశాల నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆందోళన విరమించారు.

## రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల దాడులు

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్లు, స్వీట్ హోం, హోటల్స్‌పై మంగళవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. రెస్టారెంట్ల, స్వీట్ హోం, హోటల్స్‌లో నిలువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, వార్డు అఫీసర్లు హేమంత్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన రైతు బండపల్లి మనోహర్‌కు చెందిన పాడిగేదెను మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద కట్టివేయగా అక్కడే విద్యుత్ స్తంభానికి లూజుగా ఉన్న విద్యుత్ తీగలు తెగి గేదెపై పడడంతో తన గేదె మృతి చెందినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. జీవనాధారమైన గేదె మృతి చెందడంతో 70 వేల రూపాయల ఆర్థిక నష్టంతో పాటు బతుకుదెరువు పోయిందని విద్యుత్ శాఖ అధికారులు తనను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కోనరావుపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వృద్ధుడు బద్దెపూరి నారాయణ(80) మల్కపేట రిజర్వాయర్‌లో మంగళవారం శవమై కనిపించాడు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన బద్దెపురి నారాయణ అక్టోబరు 31న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుమారుడు నవంబరు 3వ తేదీన తన తండ్రి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. కాగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మంగళవారం కుటుంబ సభ్యులకు మల్కపేట రిజర్వాయర్ నీటిలో ఒడ్డుకు శవంలా కొట్టుకువచ్చి కనిపించగా పోలీసులకు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మతిస్థిమితం లేదని, ఈతరాక అందులో పడి చనిపోయి ఉండవచ్చని, తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

### తేనెటీగల దాడిలో ఇద్దరు రైతులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలోని రైతులు కొప్పుల రవీందర్‌రెడ్డి, కుందనపల్లి రవీందర్‌రెడ్డి మంగళవారం తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుందనపల్లి రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలోని వ్యవసాయ బావి చుట్టూ ఉన్న చెట్లను జేసీబీ వాహనంతో తొలగించే పనులను చేపట్టాడు. మామిడి చెట్టుకు ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా కుందనపల్లి రవీందర్‌రెడ్డితో పాటు అక్కడే ఉన్న కొప్పుల రవీందర్‌రెడ్డిపై దాడి చేశాయి. భయంతో జేసీబీ డ్రైవర్, మరో వ్యక్తి వాహనంలో అద్దాలను వేసుకోవడం వల్ల ప్రమాదం తప్పినట్లయింది. కొప్పుల రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమంగా మారడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### ఏసీబీ తనిఖీలపై దేవాదాయశాఖ ఆరా..

వేములవాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ తనిఖీల వ్యవహారంపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఆలయంలో 2024 ఆగస్టులో జరిగిన ఏసీబీ తనిఖీలకు సంబంధించి కార్యనిర్వహణ అధికారిగా ఉన్న వినోద్‌రెడ్డిని బదిలీచేసి, మిగతా ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. రాజన్న ఆలయంలో 15 మాసాల క్రితం జరిగిన ఏసీబీ తనిఖీల వ్యవహారం మరోసారి వెలుగులోకి రావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

## ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

● ప్రిన్సిపాల్ కొట్టాడని మనస్థాపం ● పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల బైఠాయింపు

జమ్మికుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపాల్ కొట్టాడని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఇద్దరు తొమ్మిదవ తరగతి విద్యార్థులు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరుగగా మంగళవారం ఉదయం వెలుగు చూసింది. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రానికి చెందిన చరణ్‌కుమార్, రామ్‌చరణ్ జమ్మికుంటలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. ఆదివారం హాస్టల్ టెర్రస్‌పై చరణ్‌కుమార్, రామ్‌చరణ్‌తో పాటు మరొక స్నేహితుడు సిగరేట్ తాగుతున్నట్లు గమనించిన వార్డెన్ మరుసటి రోజు సోమవారం ప్రిన్సిపాల్‌కు విషయం చెప్పింది. ప్రిన్సిపాల్ విద్యార్థులను పిలిచి చేయి చేసుకుని గట్టిగా మందలించాడు. మీ తల్లిదండ్రులకు చెప్పి టీసీ ఇప్పించి స్కూల్ నుంచి పంపిస్తానని హెచ్చరించాడు. ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు పాఠశాలలో చెప్పాపెట్టకుండా ఇంటికి వెళ్లిపోయాడు. మనస్థాపం చెందిన చరణ్‌కుమార్, రామ్‌చరణ్ బయటకు వెళ్లి గడ్డి మందు తెచ్చుకుని హాస్టల్‌లోనే ఓ గ్లాసు నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు బైఠాయించి ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పద్మసాయిశ్రీ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం మత్తులో హంగామా


చందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర చెందిన ఓ కూలీ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై దాడికి యత్నిస్తూ హంగామా సృష్టించాడు. ఈ సంఘటన చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మర్రిగడ్డ గ్రామంలో మహారాష్ట్రకు చెందిన కూలి పనిచేసే కలబండే పండిత్ అనే వ్యక్తి మద్యం మత్తులో ప్రధాన రహదారిలో వెళ్లే వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళ్లే వారిపై దాడికి యత్నించాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని పండితును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పండిత్‌ను పనిచేస్తున్న సంబంధిత యజమానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుం డా కరీంనగర్ రూరల్ మండలంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

**వీణవంక** : మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకు న్నారు. మానకొండూరు మండలం వేగురుపల్లి, ఊటూరు గ్రామాలకు చెందిన బుర్ర అరవింద్, కోట సంపత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


రౌతు గంగాధర్ (ఫైల్)

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రౌతు గంగాధర్ అలియాస్ ఆలూరి రెడ్డి (35) అనే యువకుడు నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని పడకాల గ్రామంలో అనుమానాస్పదస్థితిలో మంగళవారం మృతిచెందాడు. రౌతు గంగాధర్ గ్రామంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవలే నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్ మండలంకు పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలోనే గంగాధర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శరీరంపై తీవ్రగాయాలు ఉండటం వల్ల మృతుడి బంధువులు యువకుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు శేఖర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నదిలో గల్లంతైన సాయికృష్ణ మృతదేహం లభ్యం

● అన్నారం బ్యారేజీ నీటి ప్రవాహంలో గుర్తింపు


సాయికృష్ణ (ఫైల్)

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంథని గోదావరినదిలో గల్లంతైన రావికంటి సాయికృష్ణ (30) అనే యువకుడి మృతదేహం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహంలో మంగళవారం తేలింది. స్థానిక పాత బస్టాండ్ ఏరియాకు చెందిన సాయికృష్ణ సోమవారం ఉదయం మంథని గోదావరి నదిలో ఈతకు వెళ్ళి ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం వరకు మంథని నది తీరంలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం అన్నారం బ్యారేజీ వద్ద గుర్తు తెలియని శవం తేలిందని సమాచారంతో పోలీసు, ఫైర్, కుటుంబ సభ్యులు అక్కడి వెళ్ళి చూసి సాయికృష్ణగా గుర్తించారు. మంథని ఎస్‌ఐ-2 సాగర్, ఫైర్ ఆఫీసర్ శివశంకరప్రసాద్, భూపాలపల్లి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయికృష్ణ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని రాత్రి మంథనికి తరలించారు. మృతదేహం లభ్యమైనట్లు సమాచారం అందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### స్వగ్రామానికి చేరిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం


సతీష్ (ఫైల్)

రుద్రంగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ కార్మికుడు గుండె పోటుతో మృతిచెందగా, మంగళవారం అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మర్రిపల్లి సతీష్(38) అనే వ్యక్తి ఉపాధి కోసం మస్కట్ దేశం వెళ్లాడు. నాలుగు రోజుల క్రితం గుండెపోటు రావడంతో మరణించాడు. మృతుడికి భార్య లావణ్య, కూతురు, కూమారుడు ఉన్నారు.

## ధర్మపురిలో ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 4 ( ఆంధ్రజ్యోతి ): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 14వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, శారదా మహిళా మండలి సభ్యులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్తలు రాపర్తి సాయికిరణ్, ఒజ్జల సౌజన్యనరేందర్, స్తంభంకాడి గణేష్, గుడ్ల రవీందర్, పాల్గొన్నారు.



గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

## రాజన్న భక్తులకు రక్షణేది?

- కార్తీక మాసంలో భక్తుల రద్దీ
- క్యూలైన్లలో తోపులాటలు..
- జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసుల లేఖ



బద్దిపోచమ్మ ఆలయం క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం

వేములవాడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తు లకు రక్షణేదనే సందేహం నెలకొంది. రాజన్న సన్నిధిలో విస్తరణ పనుల నేపథ్యంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో స్వామివారి లఘు దర్శనం కల్పించారు. అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాల యంలో ఆర్జిత పూజలు కొనసాగుతున్నాయి. మరో వైపు బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ రద్దీ నెలకొంటోంది. శుక్ర, ఆది, సోమ వారాల్లో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటున్నారు. శ్రీ భీమేశ్వరాల యంలో ఆర్జిత పూజలు, కోడెల మొక్కులు కొనసా గుతున్నందున భక్తులు తాకిడి పెరిగింది. కోడెల క్యూలైన్‌లో భక్తులు తోసుకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భక్తుల మధ్య వాగ్వాదం ఏర్పడు తోంది. సోమవారం ఆర్జిత సేవ అయిన కల్యాణం టికెట్ల కోసం వేచిఉన్న భక్తులు ఒక్కసారి తోసుకోవ డంతో క్యూలైన్ స్టీల్ బారికేడ్స్ వంగిపోయాయి. మంగళవారం బద్దిపోచ మ్మ అమ్మవారికి బోనం సమర్పించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారు. రానున్న రోజుల్లో భక్తులు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ భక్తజన సందోహంతో నిండిపోనుంది. దీంతో రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

### • ముందస్తు జాగ్రత్తలపై పోలీసుల లేఖ

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు తగిన భద్రత ఏర్పాట్లపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇటీవల ఆలయ ఈవోకు పోలీసులు లేఖ రాశారు. విస్తరణ పనుల దృష్ట్యా ఏదైనా కూల్చివేతలు చేపడితే ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. తమకు తెలియకుండా ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేతలు చేపడితే ఇబ్బందులు తలెత్తుతాయని, ఇటీవల ఆలయంలో ఒక ప్రాంతం కూల్చివేత సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మొదలు పెట్టాలని చూడడంతో వివాదాస్పదమైంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని పోలీసు అధి కారులు హెచ్చరించినట్లు తెలిసింది. ఆలయంలో ఏదైనా



కల్యాణం టికెట్ల కౌంటర్ వద్ద ఒరిగిన క్యూలైన్ స్టీల్ బారికేడ్స్

సంఘటనలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించినట్లు సమాచారం. కార్తీకమాసం సంద ర్భంగా రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాల యంలోనూ కిటకిటలా డుతున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులు లేఖ రాశారు. ప్రధానంగా క్యూలైన్‌లో వ్యతిరేక దిశలో ప్రవేశించకూడదు. ముందు, వెనుక ఉన్న భక్తులు నెట్టకుండా ఉండాలి. క్యూలైన్లలో పరుగులు తీయడం, తోసుకోవడం చేయకుండా భక్తులు వెళ్లాలి. క్యూలైన్‌లలో రద్దీగా ఉన్నపుడు భక్తులు సహనంతో వేచిఉండాలి. క్యూలైన్‌ల వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలి. రద్దీ ప్రదేశాల్లో భక్తులు గుంపులుగా ఉండకూడదు. ఏదైనా తొక్కిసలాట, తోపులాటల పరిస్థితులు ఉంటే వెంటనే భక్తులు దూరంగా వెల్లాలి.

### కల్యాణం టికెట్ కౌంటర్ మార్చుతాం..

**- ఆలయ ఈఈ రాజేష్**

భీమేశ్వరాలయంలోని కల్యాణం టికెట్ బుకింగ్ కౌంటర్ మార్చుతాం. సోమవారం భక్తులు తోసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రచార రథం వైపు బుకింగ్ కౌంటర్ మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మెయిన్ టెంపుల్ క్యూలైన్‌ను పటిష్టం చేస్తాం. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటాం.

## 7న సీనియర్ వాలీబాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సీనియర్ వాలీబాల్ ఎంపిక పోటీలను ఈ నెల 7న కొత్తపల్లి మండలం ఎలగందులలో నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వేణు కిషన్‌రావు, గిన్నె లక్ష్మణ్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచినవారిని ఈ నెల 13 నుంచి 16 వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వేముల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశా లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని, వివరాలకు 8099546565, 7901000546 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ వద్ద బస్సు, ట్రాక్టర్ ప్రమాద ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరా తీశారు. మణిపూర్ పర్యటనలో ఉన్న ఆయన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, తిమ్మాపూర్ పోలీసులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రయాణికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వ్యాపారులు

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ముత్తారం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎస్‌ఐ రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అడవిశ్రీరాంపూర్ చౌరస్తాలో ఆర్ఎంపీలు, వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. ఏదైనా నేరం జరిగితే నిందితులను త్వరగా గుర్తించి, శిక్షించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్, కానిస్టేబుళ్లు రాజ్ కుమార్, వెంకటరెడ్డి, హోంగార్డు రాజు, సీసీ కెమెరాల దాతలు తాటిపాముల శంకర్, హుస్సేన్, రాజేందర్, కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

## రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

వీణవంక, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల తెలంగాణ ఆదర్శ విద్యార్థులు హుజూరాబాద్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మోయిజ్‌బాగ్ తెలిపారు. అండర్ 14 విభాగంలో శ్రీచందన, అండర్17 విభాగంలో హర్షిక ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ వేణుగోపాల్ తెలిపారు. వీరు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## కొండగట్టులో భక్తుల పూజలు



కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనం చేసుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు రెండు నెలల ముందే వివిధ ఆలయాలను సందర్శించి, జాతర సమయంలో సమ్మక్క, సారక్కను దర్శించుకుంటారు. ఇందులో బాగంగానే కొండగట్టులో మంగళవారం రోజంతా భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఘాట్ రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది.

## ధర్మపురిలో వైభవంగా తులసీ కల్యాణం



ధర్మపురిలో తులసీ కల్యాణం జరుపుతున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తులసీ కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నుంచి అర్చకులు ఉత్సవ మూర్తులను శేషప్ప కళావేదికపై తీసుకవచ్చారు. అనంతరం అందంగా పూలతో అలంకరించిన రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాల స్వామివారలకు శాస్త్రోక్తంగా కళ్యాణం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# 7న 'శాతవాహన' స్నాతకోత్సవం

**- ముఖ్య అతిథులుగా ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు**

**- విద్యార్థులకు 161 బంగారు పతకాలు, 25 పీహెచ్‌డీ పట్టాల పంపిణీ**



మాట్లాడుతున్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్



స్నాతకోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవాన్ని ఈ నేల 7న నిర్వహించనున్నామని ఉప కులపతి యు ఉమేష్‌కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కులపతి, గవర్నర్‌జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బీజే రావు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగాద వర్సిటీ ఆవరణలోని క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రతిభ కనబర్చిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నాటు్ల తెలిపారు. బంగారు పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు అందుకునే విద్యార్థులు తమ పేర్లు, మొబైల్ నంబరు, ఫొటో, ఈమెయిల్ ఐడీలను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. దాని ఆధారంగా వేదిక వద్ద వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులతోపాటు ఒకరి మాత్రమే వర్సిటీలోకి అనుమతి ఉంటుందన్నారు. నవంబరు 7న ఉదయం 10 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షత వహించిన స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు.

### గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్ టౌన్ : శాతవాహన యూనివర్శిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ప్రొటోకాల్ పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ టీం, 108, 101, ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. సభావేదిక ఏర్పాట్లను ఆర్అండ్‌బీ అధికారులు, తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్ వంటి ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భద్రత ఉంటుందని, ఐడెంటిటీ కార్డులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరపున సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే వారి పేర్ల జాబితాను ముందే సమర్పించాలన్నారు. శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీసీపీ వెంకటరామిరెడ్డి ఉన్నారు.

## మళ్లీ తెరుచుకున్న ఎల్ఎండీ గేట్లు

**- 2గేట్ల ద్వారా 4వేల క్యూసెక్కుల నీటి విడుదల**



ఎల్ఎండీ నుంచి విడుదలవుతున్న నీరు

తిమ్మాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ఈ సీజన్‌లో ఎల్ఎండీ గేట్లు తరచుగా ఎత్తుతున్నారు. తుఫాను ప్రభావంతో రెండు రోజుల క్రితం తెరచి ఉన్న ఎల్ఎండీ స్పిల్‌వే గేట్లు అధికారులు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎగువన కురుస్తున్న వర్షాలతో మోయతుమ్మెద వాగు నుంచి ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు పెరుగడంతో మంగళవారం మధ్యాహ్నం రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీలోకి మోయతుమ్మెద వాగు నుంచి 4,254క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. రెండు స్పిల్‌వే గేట్ల నుంచి 4వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో కలిసి 254క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.

### శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం మంగళవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి 28,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 6 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 18,750 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతు న్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

# రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



వేములవాడలో భక్తులు



బద్దిపోచమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం కార్తీక సందడి నెలకొంది. మంగళవారం ఉదయం వర్షంలోనూ స్వామివారి లఘు దర్శనానికి బారులు తీరారు. వర్షంలోనూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు కోడె మొక్కులు చెల్లించి ఆర్జిత సేవలైన కల్యాణం, సత్యనారాయణ వ్రతం, కుంకుమ పూజలు, ఇతర పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

### బద్దిపోచమ్మ ఆలయంలో ..

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిమంది భక్తులు చేరుకోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. అయితే ఎప్పటికప్పుడు ఆలయ సూపరింటెండెంట్ రాజు, ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు పర్యవేక్షించారు.

### నేడు భీమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో బుధవారం కార్తీకపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు భీమేశ్వరస్వామివారికి, భీమేశ్వర సదన్ పరిసర ప్రాంతంలో సామూహిక దీపారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి ఈవో రాజేశ్ తెలిపారు.

## బాక్సింగ్, కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు
- జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో సాధన





నార్మల రజిత



పుల్లె సాగరిక



మొగిలి సింధూజ

మంథనిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. మండలంలోని ఎక్లాసుపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు బాక్సింగ్, కబడ్డీలో మహిళల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించిన పాఠశాల పీడీ డాక్టర్ దోమటి రవి ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలలో పాల్గొనాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నారు. పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న నార్మల రజితకు బాక్సింగ్‌పై ఆసక్తి ఉండటంతో ఆమెకు శిక్షణ ఇవ్వడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 మహిళల 48 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. సెప్టెంబరులో హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ చాటింది. బాక్సింగ్‌లో మెలకువలు నేర్చుకొని జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో కష్టపడి సాధన చేస్తున్నట్లు రజిత తెలిపింది. ఇదే పాఠశాలకు చెందిన పుల్లే సాగరిక పదో తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతోంది. కబడ్డీలో ప్రతిభ చాటుతూ జిల్లాస్థాయిలో రాణించి ఈనెల 8, 9, 10 తేదీలలో భద్రాది కొత్తగూడెంలో జరగనున్న అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సాగరిక గత సంవత్సరం జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలలో పాల్గొంది. జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ప్రాక్టీస్ చేస్తున్నట్లు తెలిపింది. పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న మొగిళి సింధూజ కబడ్డీలో రాణించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటడంతో గత నెలలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్-14 మహిళల విభాగంలో కబడ్డీ పోటీలో పాల్గొంది. జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొనడానికి కృషి చేస్తానని సింధూజ తెలిపారు.

### విద్యార్థుల ఇష్టంతోనే శిక్షణ

**-పీడీ డాక్టర్ దొమ్మటి రవి**



గత సంవత్సరం పాఠశాలకు బదిలీపై వచ్చాను. విద్యార్థులకు కబడ్డీ, బాక్సింగ్ పై ఆసక్తి ఉండటంతో వారికి ప్రత్యేకంగా రోజు శిక్షణ ఇస్తున్నా. శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. కష్టపడి సాధన చేస్తే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

### పశువులకు గాలికుంటు టీకాలు

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కల్లెడ అసిస్టెంట్ సర్జన్ వాసు పావని, పొలాస వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు జ్యోతి, నరేష్ రైతులు పాల్గొన్నారు.

### 17న చలో ఢిల్లీ

జగిత్యాల అర్బన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఈ నెల 17న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పెల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

### పేద కుటుంబానికి ఆర్థిక సాయం

జగిత్యాల అర్బన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పురాణిపేటకు చెందిన మార రమేష్ అనే వ్యక్తి లివర్ ఇన్‌ఫెక్షన్‌తో ఆసుపత్రి పాలు కావడంతో జగిత్యాల పట్టణానికి చెందిన ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్ తాను నిర్వహిస్తున్న మూడు వాట్సప్ గ్రూప్‌ల ద్వారా సేకరించిన 47వే 969 రూపాయలను మంగళవారం బాధితుడికి స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ ఎండి అలీ ఆరిఫ్ ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. రాజేశుని శ్రీనివాస్ ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీలు

బీర్‌పూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వివిధ గ్రామాలలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. నిర్వహించిన పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో నాగభూషణం చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సత్యరాజ్, న్యాయ నిర్ణేతలు మహేష్, రవీందర్, ఉపాధ్యాయులు మంజునాథ్, లక్ష్మన్, నరేష్ పాల్గొన్నారు.

### సైకిళ్ల పంపిణీ

కొడిమ్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలోని పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం మండల బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న మోదీ గిఫ్ట్ సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎ. శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నదేవి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### ఉసిరిక చెట్లు పంపిణీ

ధర్మపురి, నవంబరు 4 ( ఆంధ్రజ్యోతి ): కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఎదుట ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ మంగళవారం భక్తులకు ఉసిరిక చెట్లు పంపిణీ చేశారు.

### రోడ్డు మరమ్మతు

ఇబ్రహీంపట్నం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్షకొండ, ఇబ్రహీంపట్నం మధ్య రోడ్డు గుంతలు పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. బొల్లవేయిన శంకర్, జంగ విజయ్, దొంతుల తుక్కారాంలు మంగళవారం ట్రాక్టర్ల ద్వారా మట్టి పోయగా, జేసీబీ సాయంతో మట్టిని చదువు చేసి వాహనదారులకు ఇబ్బందులను తొలగించారు. జేసీబీ యజమాని బొల్లవేయిన శంకర్ ఉన్నారు.

# తేమ రాక.. కొనుగోళ్లు సాగక..!

● వానలతో రైతాంగం ఉక్కిరి బిక్కిరి ● పది రోజులవుతున్నా ముగ్గురు రైతులే అమ్మకం ● విధిలేక దళారులకు విక్రయం



తడిసిన మక్కలను ఆరబెడుతున్న మహిళా రైతులు

కథలాపూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధర ఆశించి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించిన రైతులు తరచూ కురుస్తున్న వానలతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మండల కేంద్రం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి పది రోజులు దాటుతున్నా కేవలం ముగ్గురు రైతుల మాత్రమే తమ ధాన్యంను విక్రయించు న్నారంటే ఇబ్బందికర పరిస్థితికి అద్దం పడుతోంది. కథలాపూర్ గుంటి పెరమాళ్ళ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంకు పలు ప్రాంతాల ధాన్యం తెచ్చుకున్నారు.

రెండు రోజులకోసారి వర్షం కురుస్తున్న క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన 14 శాతం తేమ రావడం లేదు. దీంతో రైతులు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. వానలకు ధాన్యం తడిచిపోయి రోజుల తరబడి ఎండబెట్టాల్సిన వస్తోందని వాపోతున్నారు. ఇప్పటి వరకు కేవలం ముగ్గురు రైతులకు సంబంధించిన 380 క్వింటాళ్ళు మాత్రమే కొనుగోలు చేశారు. కాగా మండలంలో కేవలం 2400 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేసుకున్నట్టు అధికారుల రికార్డుల్లో నమోదైంది. వాస్తవానికి దానికి మూడింతల విస్తీర్ణంలో సాగైందని రైతులు పేర్కొంటున్నారు. విత్తనాల సాగు సమయంలో రైతులు మొక్కజొన్న సాగు చేసుకున్నట్టు నమోదు చేసుకోలేక పోవడమే సమస్యకు కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వం ఎకరాకు 18 క్వింటాళ్ళు మాత్రమే దిగుబడి వస్తుందని నిబంధన విధించడం వల్ల రైతులు ఆందోళకు గురవుతున్నారు. ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో రైతులు మధ్య దళారులకు క్వింటాల్‌కు రు. 1900 చొప్పున విధిలేక విక్రయించుకుంటున్నారు.

#### నిబంధన ఎత్తివేయాలి

-నర్సారెడ్డి, రైతు



నేను పండించిన 60 గుంటల్లో 31 క్వింటాళ్ళ ధాన్యం పండించా. ఆన్‌లైన్‌లో 26.5 క్వింటాళ్ళు మాత్రమే విక్రయించేందుకు వీలు ఉంది. మిగిలిన నాలుగు క్వింటాళ్ల ఎలా అనేది సందిగ్దంలో ఉంది. ప్రభుత్వం నిబంధన ఎత్తివేయాలి.

#### నిబంధనల మేరకే కొనుగోళ్లు

-అరుణ్, పాక్స్ సీఈవో



ప్రభుత్వ నిబంధనల మేరకే కొను గోళ్ళు జరుపుతున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులే తమ ధాన్యం విక్రయించుకునేందుకు అవకాశం ఉంది. గన్నీ సంచులు, హమాలీ కేంద్రంలో పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారు. రైతులు తమ ధాన్యం ఇంటి వద్దే ఆరబెట్టుకుని కేంద్రంకు తరలించుకోవాలి. కేంద్రంలో రైతులకు స్థలం సరిపోదు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు అన్నారు. మంగళవారం మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీతో కలిసి ఆయన గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ముత్యంపేట, సిర్పూర్, కుస్తాపూర్, రత్నాపూర్, మొగిలిపేట, ఓబులాపూర్, వాల్గొండ, వెంకట్రావుపేట, గొర్రెపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో జరుపుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు సెర్ప్ అధికారులు, సిబ్బంది, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: వరి కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధరను పొందాలని బండలింగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నేరేళ్ల శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, బండలింగాపూర్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి, కొల్వాయి గ్రామాలలో మంగళవారం సహకార సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం చైర్మన్ ముప్పాల రాంచందర్ రావ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో భీమేష్, ఏవో తిరుపతి, ఏపిఎం ప్రమీల, ఆర్ఐలు శ్రీనివాస్, రాహుల్, సీసీ తిరుపతి, ఏఈవోలు వినోద్, శిరీష, కార్యదర్శులుఆదిత్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●భీమారం: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని భీమారం సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంళవారం ప్రారంభించారు. కార్యక్ర మంలో అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ బంగారు దీపక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్తపెల్లి అంజయ్, సొసైటీ సీఈవో కవిత, పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: రైతులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకొని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు తెలిపారు. మంగళవారం మండలంలోని ఇబ్రహీంపట్నం, గోదూర్, యామపూర్, వేములకుర్తి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజకుమార్, ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బద్దం గోపి, సంపత్, రైతులు పాల్గొన్నారు.

### నిబంధనల ప్రకారమే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జీవో.నెం ఎంఎస్ 25 ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో సంఖ్యాపరంగా, మీడియం వారీగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపెల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డిలు విద్యాశాఖ అధికారి రాముకు వినతిపత్రం సమర్పించారు.

### పెట్రోల్ బంకును తొలగించాలని నిరసన

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ఉన్న పెట్రోల్ బంకును వెంటనే తొలగించాలని కోరుతూ బీజేపీ నాయ కులు మంగళవారం పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చేతగానితనం, పాలకవర్గాల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లనే రూ.వంద కోట్ల విలువచేసే మున్సిపల్ భూమి అన్యాక్రాంతం అయ్యిందని ఆరోపించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, అరవ లక్ష్మీ, ఏసీఎస్ రాజు, ఆన్‌కార్ సుదాకర్, ఠాకూర్ కిషోర్ సింగ్, బాశెట్టి ప్రభాకర్, బిట్టు తదితరులు పాల్గొన్నాడు.

### పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

మల్లాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, పీఆర్‌సీని ప్రకటించాలని టీపీటీఎఫ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉపాధ్యాయులకు నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోవర్ధన్, సత్యప్రకాష్, భాస్కర్, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

## భూసార కార్డులతో భూమి స్వభావం తెలుస్తుంది



రైతులకు భూసార కార్డులు పంపిణీ చేస్తున్న డీఏవో భాస్కర్

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):భూసార ఆరోగ్య కార్డుల ఆధారంగా రైతు వారీగా భూమి సారం వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. తద్వారా పండించే పంటలకు అనుగుణంగా యూరియా, డీఏపీ, పోటాష్, ఇతర ఎరువుల ఎంత వేసుకోవాలో తెలుస్తుందని ఆయన అన్నారు. గ్రామాల్లో సర్వే నంబరు ఆధారంగా భూసార పరీక్ష నమూనాలు సేకరించి పరీక్షించింది. భూసార కార్డులను మంగళవారం మల్యాలలో జిల్లా వ్యవసాయ అధికారి మండల రైతులకు పంపిణీ చేశారు. మండలం లోని మానాల, తాటిపల్లి రైతువేదికల్లో నిర్వహించిన కార్యక్రమంలో రైతలుకు అందించారు. అనంతరం మాట్లాడుతూ భూసార కార్డుల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, సింగిల్‌విండో చైర్మన్ తొట్ల చంద్రశేఖర్, ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ కళాశాలల నిర్వాహకుల ఆందోళన

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ కళాశాలల బంద్‌కు మద్దతుగా కళాశాలల నిర్వాహకులు విన్నూతన నిరసన తెలిపారు. మంగళవారం ప్రైవెట్ డిగ్రీ, పీజీ కళాశాల సంఘ జిల్లా అధ్యక్షుడు పోతని ప్రవీన్ కుమార్ అధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహంకు వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్బంగా నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్బంగా పోతని ప్రవీన్ కుమారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపల్స్ పోతని నవీన్ కుమార్, నరేష్, ప్రవీణ్‌లతో పాటు ఉపన్యాసకులు పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్ ఎన్నికల బాధ్యురాలిగా జ్యోతి



జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచార బాధ్యతలలో భాగంగా కాంగ్రెస్ సమన్వయం కోసం ఏర్పాటు చేసిన మహిళా కమిటీలో జగిత్యాలకు చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌కు చోటు కల్పిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఏడు డివిజన్లలో ప్రచార బాధ్యతలను నిర్వహిం చడంలో భాగంగా మహిళా ఆర్గనైజర్ కమిటీని ఏర్పాటు చేశారు. మహిళా కమిటీలో అడువాల జ్యోతి లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగించారు.

### సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సుమారు రు. 50 కోట్లతో చేపడుతున్న 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల పురోగతి లేదని పేర్కొంటూ 'పనులకు గ్రహణం...లోవోల్టేజీతో సతమతం' అనే శీర్షికన గత నెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంకు అధికారులు స్పందించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ మొరం వేసే పనులను ముమ్మరం చేశారు. గత ఆరు మాసాలుగా పలు కారణాల వల్ల పెండింగ్‌లో పడ్డ పనులను ప్రారంభించడంతో విద్యుత్ వినియోగదారులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

### షాట్‌పుట్‌లో విద్యార్థి ప్రతిభ

ధర్మపురి, నవంబరు 4 ( ఆంధ్రజ్యోతి ): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాలకు చెందిన ఆర్ ఐశ్వర్య అనే ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి అథ్లెటిక్స్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. కళాశాలకు చెందిన విద్యార్థి ఐశ్వర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 19 అథ్లెటిక్స్ పోటీల్లో షాట్ పుట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై హైదరాబాద్ జింఖానా మైదానంలో ఈ నెల 5, 6 వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా నుండి ప్రాతినిథ్యం వహిస్తుంది. ఐశ్వర్యను కళాశాల ప్రిన్సిపల్ పద్మ, వైస్ ప్రిన్సిపల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

## 'ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యాన్ని హరించిన బీజేపీ'




సంతకాల సేకరణ చేసిన పుస్తకాలను అందిస్తున్న విజయలక్ష్మి

జగిత్యాల అర్బన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హరించిందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ విమర్శించారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మహిళా కాంగ్రెస్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సుగుణ, కార్యదర్శి వెంకట సుబ్బమ్మ ముఖ్యఅతిదిగా హాజరయిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఓటు చోరీపై సంతకాల సేకరణకు జిల్లాలో విశేష స్పందన వచ్చిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజాస్వామ్యంను దుర్వినియోగం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఓటు చోరీపై ఆధారాలు సేకరించిన కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాదాన్యం ఉన్నదని అలాంటి ఓటును బీజేపీ అపహాస్యం చేసిందని అన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణపై అనుకూల తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు హనుమండ్ల జయశ్రీ, అల్లాల సరిత, పులి సునిత, సౌజన్య, హరిత తదితరులు పాల్గొన్నారు.

### విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లాలనుకునే నిరుద్యోగ కార్మికులు ఏజెంట్ల మోసాల బారిన పడకుండా ప్రభుత్వరంగ సంస్థ అయిన తెలంగాణ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా జర్మన్‌లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో టామ్‌కామ్ ఆధ్వర్యంలో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200మంది ఆశావాహులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం సత్యమ్మ మాట్లాడుతూ గల్ఫ్ వలసల కారణంగా అధిక సంఖ్యలో మోసాలు జరుగు తున్నందున వాటిని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరేష్, సీనియర్ అసిస్టెంట్ లింగమూర్తితో పాటు హైదారాబాద్‌కు చెందిన టామ్‌కామ్ ప్రతినిదులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

మెట్‌పల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని చౌలమద్ది గ్రామంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం గ్రామంలోని పశు కేంద్రాన్ని సందర్శించి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల వివరాలు, ఆన్‌లైన్ నమోదు, రికార్డులను పరిశీ లించారు. అనంతరం కేంద్రం ఆవరణలో మండల వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్‌తో కలిసి మొక్క నాటి నీరు పోశారు. పశు వైద్య కేంద్రం, ఆవరణం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వైద్యులు అందిస్తున్న మెరుగైన పశువైద్య సేవలకు వారిని అభినందించారు. ఈ సందర్బంగా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత శిబిరాలు నిర్వహిస్తూ పశు పోషకులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడంలో చౌలమద్ది ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్, సహాయక సిబ్బంది రమాదేవి, ఖాజా, చిరంజన్, దిలీప్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### యాసంగి సాగుకు కార్యాచరణ

(మూడో పేజీ తరువాయి)

ఉత్తమమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నప్పటికీ రైతులు ప్రధాన పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

●విత్తనాలు, ఎరువుల అవసరాలు ఇలా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో యూరియా 49,948 మెట్రిక్ టన్నులు, డీఏపీ 16,899 మెట్రిక్ టన్నులు, పొటాష్ 8,330 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 37,844 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 3,665 మెట్రిక్ టన్నులు అవసరముంటుందని అంచనా వేశారు. అదేవిదంగా వరి విత్తనాలు 75,650 క్వింటాళ్ల, మొక్కజొన్న 2,800 క్వింటాళ్ల, నువ్వు 385 క్వింటాళ్ల, జొన్న 35క్వింటాళ్ల, పల్లి 128 క్వింటాళ్ళలో అవసరవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈమేరకు ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

### ఘనంగా కార్తిక దీపోత్సవం



అంజనేయస్వామి ఆలయంలో దీపాల అలంకరణ

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని అంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం కార్తిక దీపోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా దేవాలయం పురోహితులు ప్రత్యేక పూజలను నిర్వహించంగా మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో దేవాలయ ఈఓ విక్రం, అర్చకులు ఉద్దంటి శ్రీకాంత్, శ్రీదర్, అసిస్టెంట్ పెడిపల్లి నర్సయ్య పాల్గొన్నారు.

### ప్రభుత్వ సలహాదారుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఇటీవల నియమితులైన బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం కలిశారు. ఈ సందర్భగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### మాజీ మంత్రి హరీష్‌రావును పరామర్శ

జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావును మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించగా ఆయనను సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట హైకోర్టు న్యాయవాది రవీందర్‌రావు ఉన్నారు.

### విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు

రాయికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ గెజిటెడ్ ఉపాధ్యాయ సంఘం, టీ-శాట్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి అను శ్రీ (కస్తూర్బా గాంధీ పాఠశాల) సాధించారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి రామాజీపేట ఉన్నత పాఠశాల సాధించారు. ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి డి.చంద్రిక (అల్లీపూర్ ఉన్నత పాఠశాల) సాధించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కార్యక్రమ నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్, చిప్ప మల్లేశం పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్, టీసాట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో గంభీర్‌పూర్ హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. వ్యాస రచన పోటీల్లో వైకీర్తన విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో మహతి (కేజీబీవీ), రిషానా, సుమయ్యలు గెలుపొందారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శశిధర్, వెంకటేశం, ధరందీప్, నరేశ్, విశ్వనాథం, గంగాధర్, విజయ్ తదితరులు ఉన్నారు.

●**మల్యాల:** మండల స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ అంశాలలో వార్షిక పోటీలు నిర్వహించగా తమ ప్రతిభ చాటారు. వ్యాసరచన పోటీలో సిహెచ్ సాత్విక, బి.అక్షిత, వక్తృత్వ పోటీలో ఎం.శివకుమార్, పి.దీక్షిత ప్రతిభ చాటినట్లు మండల విద్యాధికారి జచసింహరావు తెలిపారు. అలాగే క్విజ్ పోటీలో బి.రఘు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అనుపమ, నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

ధర్మపురి, నవంబరు 4 ( ఆంధ్రజ్యోతి ): ధర్మపురి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీల్లో విజేతలకు మంగళవారం సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. టీఎస్‌పీటీ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో వ్యాసరచన పోటీల్లో ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థి శ్రీహర్షవర్ధన్, ఉపన్యాస పోటీల్లో అదే పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి ఎం. సిద్దుసాయిరాజ్ ప్రథమ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటీల్లో నేరెళ్ల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి మణికుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడు. కార్యక్రమంలో ధర్మపురి, రాజారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు పెండ్యాల మహేందర్, చల్ల జనార్ధన్ పాల్గొన్నారు.

### అల్లాడి ప్రభాకర్ సేవలు అభినందనీయం




ప్రభాకర్‌కు అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేస్తున్న అల్లాడి ప్రభాకర్ అభినందనీయుడని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఫోర్బ్స్ ఇండియా, నెట్‌వర్క్ 18 అండ్ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విసర్వ్ ఇండియా సీజన్-2 అవార్డు (సౌత్ అండ్ వెస్ట్ జోన్) కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రయోగాల ప్రభాకర్ అలియాస్ అల్లాడి ప్రభాకర్‌కు విన్నర్ అవార్డును కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

### గోదావరికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో స్నానాలు ఆచరించే భక్తులు తగు సూచనలు పాటించాలని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవీందర్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

●వెల్గటూర్: కోటిలింగాల వద్ద గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తగా ఉండాలని ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి సూచించారు.

### కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కోరుట్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులు ఉంజల్ సేవ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను జరిపారు.